సంపుటి :02 సంచిక :185 పేజీలు :06 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

మంగళవారం 16, సెప్టెంబర్ 2025



## సీఎంను కలిసిన ఎంపీ

వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రితో చర్చ

02

## విద్యుత్‌శాఖ ఏడీఈ అరెస్టు

ఆదాయానికి మించి రూ.300 కోట్ల ఆస్తులు కూడబెట్టిన అధికారి

05

నేటి అర్ధరాత్రి నుంచి

# ఆరోగ్యశ్రీ సేవలు బంద్

**పేరుకుపోయిన బకాయిలు రూ.1,400 కోట్లు**



- మొదటి విడతగా రూ.100 కోట్లు.. మరికొద్దిరోజుల్లో రూ.40 కోట్లు ఇస్తామన్న సర్కార్
- ససేమిరా అన్న టీఏఎన్‌హెచ్ఏ ప్రతినిధులు
- సేవలు నిలిచిపోతే ప్రజారోగ్యంపై ప్రభావం
- ఉద్యోగులు, జర్నలిస్టుల హెల్త్ స్కీములకూ బ్రేక్

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

తెలంగాణ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ (టీఏన్‌హెచ్ఏ) పిలుపు మేరకు ఆరోగ్యశ్రీ పరిధిలోని 323 నెట్‌వర్క్ ప్రైవేటు ఆస్పత్రుల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోనున్నాయి. ప్రభుత్వం నుంచి పెద్దమొత్తంలో బకాయిలు రావాల్సి ఉందని, ఈ విషయమై ఆరోగ్యశాఖ మంత్రి, ఆరోగ్యశ్రీ సీఈవోలను కలిశామని.. అయినా పరిష్కారం కాకపోవడంతో వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు అసోషియేషన్ ప్రకటించింది. తమకు రూ.1,400 కోట్ల బకాయిలు విడుదల చేయాల్సి ఉండగా, సోమవారం రూ.100 కోట్ల బకాయిలు విడుదల చేశామని, మరో రూ.40 కోట్లు త్వరలో విడుదల చేయనున్నామని వైద్య వర్గాలు వెల్లడించాయి. అయితే.. ప్రభుత్వం ఇచ్చే ఆ సొమ్ము ఏమాత్రం సరిపోదని అసోషియేషన్ స్పష్టం చేసింది. సేవల బంద్ కొనసాగుతుందని తేల్చిచెప్పింది.

04



# డోర్నకల్ పొలిటికల్ వార్

## బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య వాగ్యుద్ధం

- యూరియా కొరతపై నిప్పులు చెరిగిన మాజీ మంత్రి సత్యవతిరాథోడ్
- స్వయంగా తాను లైన్‌లో నించున్నానని వ్యాఖ్యలు
- కేంద్ర ప్రభుత్వమే కారణమన్న ఎమ్మెల్యే రామచంద్రునాయక్
- మహానటి సావిత్రిలా సత్యవతి నటించారని ఎద్దేవా
- రెండు వర్గాల మధ్య కొనసాగుతున్న వైరం

02

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

బీఆర్ఎస్ నాయకురాలు, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్ మధ్య నెలకొన్న వివాదం డోర్నకల్ నియోజకవర్గ రాజకీయాలను వేడెక్కించింది. యూరియా కొరతపై మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ చేసిన విమర్శలతో ఈ వివాదం మొదలైంది. రైతులు ఎదుర్కొంటున్న యూరియా సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించగా, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్ ఆమె వ్యాఖ్యలను ఖండించారు. మహానటి సావిత్రిలా యూరియా కోసం క్యూలైన్లలో నించున్నారని మండిపడ్డారు. వీరిద్దరి మధ్య మాటల యుద్ధం ప్రస్తుతం మానుకోట జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.

## అభ్యసన స్థాయిని పెంచాలి



- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- గూడూరులోని పీఎంశ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ తనిఖీ

02



## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

05



# సీఎంని కలిసిన ఎంపీ


## వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రితో చర్చ

అక్షరదర్బార్, హనుమకొండ: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య హైదరాబాద్ లో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాజీపేట రైల్వే స్టేషన్ ఎదుట నూతన మల్టీ మోడల్ ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఎంపీ కావ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ బస్టాండ్ నిర్మాణం ద్వారా ప్రయాణీకులకు విశేష ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. భూపాలపల్లిలో రైల్వే స్టేషన్ ఏర్పాటు, భూపాలపల్లిని హసన్‌పర్తి రోడ్ లేదా భూపాలపల్లి జిల్లాకు దగ్గరగా ఉన్న ఉప్పల్, కమలాపూర్ రైల్వే స్టేషన్‌లకు అనుసంధానించే కొత్త రైల్వే లైన్ నిర్మాణంతో ప్రజా ప్రయోజనంతో పాటు ప్రాంతీయ అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇప్పటికే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని, మరోసారి రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సీఎంని కోరారు. నష్కల్ నుంచి హసన్‌పర్తి, చింతల్‌పల్లి నుంచి నష్కల్ వరకు రెండు కొత్త రైల్వే బైపాస్ లైన్లను ప్రతిపాదించారని, ప్రతిపాదిత అలైన్‌మెంట్‌లు వరంగల్ మాస్టర్ ప్లాన్ 2041కి విరుద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత ప్రతిపాదనలను పునఃపరిశీలించడం ద్వారా ఓఆర్ఆర్ ను ఆనుకుని రైల్వే మౌలిక సదుపాయాలను ప్లాన్ చేయాలని, అప్పుడు రైతుల సమస్య తీరుతుందని, ట్రాఫిక్ సమస్య ఉండదని, వరంగల్ నగర ప్రణాళికతో పాటు అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ అంశంపై కూడా గతంలో కేంద్ర రైల్వే మంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించినట్లు వెల్లడించారు. వరంగల్ పార్లమెంటరీ నియోజకవర్గంలోని ఎంతో గొప్ప చారిత్రాత్మక దేవాలయాలైన శ్రీ భద్రకాళి ఆలయం, వేయి స్తంభాల ఆలయంతో పాటు చిల్పూర్ శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయం సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం సహకరించాలని కోరారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గణపురం కోటగుల్లు దేవాలయాన్ని, నాపాక, రెడ్డి గుడి దేవాలయాల పునరుద్ధరణను వేగవంతం చేయాలని కోరారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్రానికి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు.



# డోర్నకల్ లో పొలిటికల్ వార్





**బీఆర్ఎస్ నాయకురాలు, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్ మధ్య నెలకొన్న వివాదం డోర్నకల్ నియోజకవర్గ రాజకీయాలను వేడెక్కించింది. యూరియా కొరతపై మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ చేసిన విమర్శలతో ఈ వివాదం మొదలైంది. రైతులు ఎదుర్కొంటున్న యూరియా సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించగా, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్ ఆమె వ్యాఖ్యలను ఖండించారు. మహానటి సావిత్రిలా యూరియా కోసం క్యూలైన్లలో నించున్నారని మండిపడ్డారు. వీరిద్దరి మధ్య మాటల యుద్ధం ప్రస్తుతం మానుకోట జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.**

- బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య వాగ్యుద్ధం
- యూరియా కొరతపై నిప్పులు చెరిగిన మాజీ మంత్రి సత్యవతిరాథోడ్
- యూరియా కోసం స్వయంగా తాను లైన్‌లో నించున్నానని వ్యాఖ్యలు
- యూరియా కొరతకు కారణం కేంద్ర ప్రభుత్వం అన్న ఎమ్మెల్యే రామచంద్రునాయక్
- మహానటి సావిత్రిలా సత్యవతి నటించారని ఎద్దేవా
- రెండు వర్గాల మధ్య కొనసాగుతున్న వైరం

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :**

డోర్నకల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం జరుగుతున్నది. యూరియా కొరతపై ఒకరిపై ఒకరు వాగ్బాణాలు సంధించుకుంటున్నారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ రెండు రోజుల క్రితం మానుకోట జిల్లా కురవి మండలం గుండ్రాతిమడుగులో క్యూలైన్లలో పీఏసీఎస్ వద్ద నించుని యూరియా బస్తాలు తీసుకోవడం రాష్ట్రంలో హాట్ టాపిక్ మారింది. దీనిపై ఆమె స్పందిస్తూ రాష్ట్రంలో యూరియా కొరత ఎలా ఉందో చాటిచెప్పేందుకే తాను లైన్లలో నించున్నానని చెప్పడం చర్చకు దారి తీసింది. యూరియా సమకూర్చడంలో ప్రభుత్వం విఫలమైందని.. రైతులు ఇబ్బంది పడుతున్నా 'దున్నపోతుపై వాన కురిసినట్లు ప్రభుత్వం ప్రభుత్వం పరిస్థితి ఉంది' అని వ్యాఖ్యానించడం రాజకీయంగా దుమారం రేపింది. దీనిపై డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్ స్పందిస్తూ.. రాష్ట్రంలో యూరియా కొరతకు కారణం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని, అది తెలిసి కూడా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మహానటి సావిత్రిలా పదిమంది మహిళలను వెనుక వేసుకుని యూరియా కోసం క్యూలైన్లలో నించోవడం సరికాదని సూచించారు. ప్రస్తుతం వీరిద్దరి మధ్య వాగ్వాదం రాజకీయపరమైన చర్చకు దారితీసింది.

### - సత్యవతి రాథోడ్ ఘాటు వ్యాఖ్యలు..

**యూరియా కొరత వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శలు చేయడంతో ఈ వివాదం మొదలైంది. "ప్రజా సమస్యలు తెలియజేసిన ప్రతిసారీ వీడియో వదుల్తావ్... ఇదేనా మీ ప్రజాపాలన?" అంటూ ఆమె ఎమ్మెల్యే రామచంద్రునాయక్ పై నిప్పులు చెరిగారు. యూరియా కోసం రైతులు పడుతున్న బాధలు ఆయనకు తెలియవా? డోర్నకల్ లో గెలిచి సూర్యాపేటలో నివసించడం వల్ల స్థానిక సమస్యలపై ఆయనకు అవగాహన లేదు. మా కుటుంబానికి 22 ఎకరాల పొలం ఉన్నప్పటికీ మేం యూరియా కోసం గంటల తరబడి లైన్ లో నిలబడి కేవలం 10 బస్తాలు మాత్రమే పొందాం. రైతుల కష్టాలపై శ్రద్ధ పెట్టకుండా ఎమ్మెల్యే డ్రామాలు చేస్తున్నారు' అని ఆరోపించారు.**

### - రామంద్రునాయక్ సమాధానం..

మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శలకు రామచంద్రునాయక్ అదే స్థాయిలో ఘాటుగా బదులిచ్చారు. సత్యవతి రాథోడ్ వ్యాఖ్యలు కేవలం రాజకీయ లబ్ధి కోసమే. రైతుల సమస్యలపై ఆమెకు నిజమైన చిత్తశుద్ధి లేదు. మహానటి సావిత్రిని మరిపించేలా గుండ్రాతిమడుగులో నటించారు. రాష్ట్ర ప్రభుత్వం యూరియా సమకూర్చాలని చూస్తుంటే, ఆమె రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదు. ప్రజలందరూ ఈ డ్రామాలను గమనిస్తున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమెకు తగిన బుద్ధి చెబుతారు అని హెచ్చరించారు. ఈ ఇద్దరు నాయకుల మధ్య జరుగుతున్న మాటల యుద్ధం ఇప్పుడప్పుడే సద్దుమణగనట్టు కనిపిస్తోంది. సత్యవతి రాథోడ్, రామచంద్రునాయక్ ఇద్దరూ తమ తమ రాజకీయ ప్రాబల్యం, ప్రజా సమస్యలపై తమకున్న పట్టును నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో, ఇద్దరూ తమపై నిరాధార ఆరోపణలు చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఒకరినొకరు హెచ్చరించుకుంటున్నారు. ఈ వివాదం కేవలం యూరియా సమస్యతో ఆగకుండా, డోర్నకల్ రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తోంది.

# అభ్యసన స్థాయిని పెంచాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- గూడూరులోని పీఎంశ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ తనిఖీ



అక్షరదర్బార్, హనుమకొండ: విద్యార్థుల అభ్యసన స్థాయి తక్కువగా ఉందని, అభ్యసన స్థాయిని పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరులోని పీఎంశ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలలోని ఏడు, ఎనిమిది, పదో తరగతులను సందర్శించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షించారు. పదో తరగతి విద్యార్థులను గణిత సబ్జెక్టుకు సంబంధించిన పలు అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రి మిడ్లెన్ టెస్ట్ పరిశీలించారు. విద్యార్థుల ప్రవర్తన రీతి ఎలా ఉంటుందని కలెక్టర్ ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. డ్రగ్స్ సంబంధిత సమస్యలు ఏవైనా ఉన్నాయా అని ఆరా తీశారు. పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తున్నారని ఉపాధ్యాయులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో మెరుగ్గా ఉండేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగ్గా ఉండాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, ఎంఈఓ శ్రీధర్, తదితరులతో పాటు పాఠశాల ప్రిన్సిపల్ అనితా కుమారి ఉన్నారు.

## యూరియా కోసం వెళ్తే..

# బస్తాలు లేవన్న డీలర్



అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలం పెద్దకొడపాక గ్రామంలో రైతులకు యూరియా బస్తాల కోసం 200 మంది రైతులకు పైగా టోకెన్లు ఇవ్వడం జరిగింది.ఈ టోకెన్ తీసుకొని శాయంపేట ఆగ్రోస్ లో యూరియా బస్తాలు తీసుకెళ్లడానికి వెళ్లగా సంబంధిత డీలర్ మా దగ్గర మీ రైతులకు సరిపడా యూరియా లేదంటూ రేపు లేదా ఎల్లుండి ఇస్తాం అంటూ రైతులను మళ్లీ రిటర్న్ పంపించడం జరిగిందని రైతులు తెలిపారు.

# వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలి

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ను ఫోన్ లో కోరిన మాజీ ఎమ్మెల్యే గండ్ర

అక్షర దర్బార్, భూపాలపల్లి : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్స్ సెప్టెంబర్ 12 నుంచి చేపట్టిన సమ్మెలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వర్కర్స్ సమస్యలను పరిష్కరించాల్సిందిగా రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను ఫోన్‌లో కోరారు. జీ.ఓ 64 ద్వారా వేతనాల్లో కోత విధించడం సరైందికాదని పేర్కొంటూ, దానిని వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఆశ్రమ పాఠశాలను సందర్శించిన గండ్ర, విద్యార్థినులతో మాట్లాడారు. బాలికల హాస్టల్ పక్కనే బాయ్స్ హాస్టల్ ఏర్పాటు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఐటీడీఏ ఏపీవోతో మాట్లాడి బాయ్స్ హాస్టల్‌ను అక్కడి నుంచి తరలించాలంటూ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పర్యావరణాన్ని పరిరక్షించాలి



అక్షర దర్బార్, రేగొండ: అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం సందర్భంగా జగ్గయ్యపేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు తంగళ్ళపల్లి కుమారస్వామి విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. ఓజోన్ పొర భూమిని యూ.వి. కిరణాల నుండి రక్షిస్తుందని, హానికర రసాయనాల వినియోగాన్ని తగ్గించి చెట్ల నాటకం, పర్యావరణహిత జీవనశైలిని అవలంబించడం భావి తరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించేందుకు అవసరమని పిలుపునిచ్చారు.





# పరకాల బస్టాండ్ లో పార్కింగ్ పరేషాన్..!

- అడ్డదిడ్డంగా ద్విచక్ర వాహనాల పార్కింగ్
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్

అక్షర దర్బార్, పరకాల: పరకాల బస్టాండ్ ప్రయాణికులకు సౌకర్యాల కేంద్రముగా కాకుండా ఇబ్బందుల అడ్డాగా మారింది. బస్టాండ్ లోపల ద్విచక్ర వాహనాలు ఇష్టమున్నట్లు నిలిపివేయడం వల్ల ప్రయాణికులు తీవ్ర అసౌకర్యాలను ఎదుర్కొంటున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు ఉదయం వాహనాలు అక్కడే పెట్టి సాయంత్రం వచ్చేదాకా అలాగే వదిలేస్తుండటంతో బస్టాండ్ లో వాహనాలు తిరిగే స్థలం లేక నిత్యం ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. దీనిపై ఆర్టీసీ అధికారులు "నిమ్మకి నేరెత్తినట్టుగా" వ్యవహరిస్తూ ఉండటం ప్రయాణికుల ఆగ్రహానికి కారణమైంది.సామాన్య ప్రజలకు ఉపయోగపడాల్సిన బస్టాండ్, కొందరి నిర్లక్ష్యం వల్ల వాహనాల గోదాముగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. ప్రయాణికులు తక్షణమే చర్యలు తీసుకొని బస్టాండ్ లో ద్విచక్ర వాహనాలను బయట పార్కింగ్ ను పూర్తిగా నిషేధించాలని డిమాండ్ చేస్తున్నారు.

### రెండు రోజుల్లో క్లియర్ చేస్తాం..



పరకాల బస్టాండ్ లో వాహనాల సమస్యపై డిపో మేనేజర్ రాంప్రసాద్ స్పందించారు. స్కూటర్–సైకిల్ స్టాండ్ టెండర్ పూర్తయ్యిందని, రెండు రోజుల్లో ఆర్ఎం ఆఫీస్ క్లియరెన్స్ రాగానే వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

— డిపో మేనేజర్ రాంప్రసాద్



# ఖేలో ఇండియా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

అక్షర్ దర్బార్, భూపాలపల్లి : వరంగల్ జిల్లా కేంద్రంలోని స్థానిక మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 14వ తేదీన జరిగిన ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ 2025-26 పోటీల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థులు పాల్గొని పలు విభాగాల్లో పతకాలు సాధించినట్లు సీనియర్ మాస్టర్, కిక్ బాక్సింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటే శ్రీనివాస్ (మాదాసి) మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాస్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. చిల్డ్రన్స్ విభాగంలో ఆరాధ్య రజత పతకం, అక్షర కాంస్య పతకం, ఎంగెస్ట్ విభాగంలో రితిక రాజ్ బంగారు పతకం, మాదాసి విధిష దేవి రజత పతకం, సంజన శ్రీ రజత పతకం, నవ్యశ్రీ రజత పతకం సాధించినట్లు పేర్కొన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను పోటీల నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించినట్లు ఈ సందర్భంగా మాస్టర్ శ్రీనివాస్ తెలిపారు.

# 19న మొగుళ్లపల్లి జోనల్ ఎస్జీఎఫ్ క్రీడలు



అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి జోనల్ ఎస్జీఎఫ్ క్రీడలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మొగుళ్ళపల్లిలో ఈనెల 19న నిర్వహిస్తున్నట్లు జోనల్ చైర్మన్, ఎంఈవో లింగాల కుమారస్వామి తెలిపారు. ఈ సందర్భంగా జోనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుండెల్లి రాజయ్య మాట్లాడుతూ.. ఈనెల 19న చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మూడు మండలాలను కలిపి మొగుళ్ళపల్లి జోనల్ స్థాయి ఎస్జీఎఫ్ క్రీడలు అండర్-14, అండర్ -17 బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో 450 మంది క్రీడాకారులు ఈ జోనల్ స్థాయి క్రీడోత్సవాలలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు టి.వెంకన్న, చిట్యాల ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ సూదం సాంబమూర్తి టేకుమట్ల మండల ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ పృధ్వీరాజు సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు టి స్వరూపారాణి బండి ప్రసాద్, సందీప్ రెడ్డి, గాజర్ల శ్రీనివాస్, మహేష్, సుమలత, కార్తీక్ సంతోష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి నిర్మూలనకు ప్రత్యేక బృందాలు

- భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే



అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: జిల్లాలో గంజాయి సహా నిషేధిత మాదకద్రవ్యాల నిర్మూలనపై భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల మాదకద్రవ్యాల వినియోగం, వ్యాపారం, సాగు విస్తరిస్తున్న పరిస్థితిని పరిగణలోకి తీసుకుని వాటిని అరికట్టేందుకు సమగ్ర వ్యూహరచనతో చర్యలు ప్రారంభించారు. ఈ క్రమంలో ప్రతి సర్కిల్ పరిధిలో ఒక్కో ప్రత్యేక బృందాన్ని, అదనంగా భూపాలపల్లి టౌన్ పరిధిలో మరొక బృందాన్ని ఏర్పాటు చేసి, మొత్తం ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ బృందాలు తమ పరిధిలో గంజాయి వినియోగం జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకోవడం, సాగు జరుగుతున్న పొలాలను వెలికితీయడం, సరఫరా మార్గాలను అడ్డుకోవడం, వ్యాపార వలయాలను ఛేదించడం, అలాగే వినియోగదారులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం వంటి కీలక బాధ్యతలు నిర్వర్తించనున్నాయి. ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ, "మాదకద్రవ్యాలు సమాజానికి ప్రమాదకరం. ఇవి యువతను, కుటుంబాలను దారి తప్పించి సమాజ శాంతి, భద్రతలకు ముప్పు తెస్తాయి. వాటిని నిర్మూలించడం పోలీసుల ప్రథమ కర్తవ్యంగా భావిస్తున్నాం. అని తెలిపారు, ఇందులో ప్రజల సహకారం అత్యంత అవసరం అని ఎవరైనా సమాచారం ఇవ్వాలనుకుంటే ఎలాంటి భయం లేకుండా పోలీసులకు సమాచారం అందించాలని సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచబడునని అలాగే, జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల నిర్మూలన కోసం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల స్థాయిలో ప్రత్యేక ప్రచారాలు నిర్వహించి, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను ప్రజలకు వివరించడం ద్వారా యువతను వాటి బారిన పడకుండా కాపాడేందుకు పోలీసులు కృషి చేయనున్నారని ఎస్పీ తెలిపారు.



# ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండల కేంద్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.8,300 కోట్లు వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి అజయ్ మాట్లాడుతూ, "ప్రభుత్వం వద్ద రూ.8,300 కోట్లు పెండింగ్‌లో ఉండగా కేవలం రూ.600 కోట్లు మాత్రమే విడుదల చేయడం సరికాదని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం, ప్రైవేట్ యాజమాన్యాలు చెలగాటం ఆడుతున్నాయని మండిపడ్డారు. పూర్తిస్థాయి నిధులు విడుదలయ్యే వరకు ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిగ్రీ, జూనియర్ కళాశాల అధ్యక్షులు సాయి చరణ్, నాగరాజు, శశివర్ధన్, కృష్ణ విద్యార్థులు పాల్గొన్నారు.

## బతుకమ్మ, దసరా పండుగలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**అధికారులకు కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాలు**



అక్షర దర్బార్, భూపాలపల్లి : జిల్లాలో బతుకమ్మ, దసరా పండుగలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ఘనంగా జరిగేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసి కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, నిమజ్జన ఘాట్ల వద్ద విద్యుత్ సదుపాయం, బారికేడ్లు, పోలీస్ బందోబస్తు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై ముందుగానే చర్యలు తీసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 20వ తేదీ లోపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మండల స్థాయిలో అధికారులు ప్రత్యక్ష పర్యవేక్షణ చేసి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## సెప్టెంబర్ 17న ప్రజాపాలన వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని అన్ని మండల ప్రభుత్వ కార్యాలయాల తోపాటు గ్రామపంచాయతీలలో సెప్టెంబర్ 17న ప్రజాపాలన వేడుకలను ఘనంగా నిర్వహించాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ప్రభుత్వ అధికారులను ఆదేశించారు మండల పరిధిలో ఎంపీడీవో ఎమ్మార్వో తో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు గ్రామపంచాయతీలలో ప్రజాపాలన వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జీవో నెంబర్ 1235 ద్వారా ఆదేశాలు జారీ చేశారు.

## ఆర్టీసీ 'యాత్ర దానం'

**- పోస్టర్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే రేవూరి**



అక్షర దర్బార్, పరకాల: టీజీఎస్ ఆర్టీసీ సంస్థ అందిస్తున్న యాత్ర దానం బస్సు సర్వీస్ లను సద్వినియోగం చేసుకోవాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, పరకాల డిపో మేనేజర్ రాంప్రసాద్ లు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్టీసీ సంస్థ ద్వారా ప్రారంభించిన యాత్ర దానం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అనాథలు, నిరాశ్రయులు, వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద విద్యార్థులను వివిధ కార్యక్రమాలైన దైవదర్శనాలకు, విహార, వైజ్ఞాని యాత్రలకు, పుణ్యక్షేత్రాలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

# పరకాల డెయిరీని అభివృద్ధి చేసుకుందాం

**ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**




అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలో ఎమ్మెల్యే కార్యాలయంలో దామెర, ఆత్మకూర్, నడికూడ, పరకాల మండలాల ఇందిరా మహిళా ప్రాథమిక సహకార పాల ఉత్పత్తిదారుల సంఘాల ఈసీ సభ్యుల శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. మహిళల భాగస్వామ్యంతో దామెరలో నూతనంగా నిజాయితీ, నిబద్ధత, మన పెట్టుబడి పేరుతో పరకాల ఇందిరా మహిళ పాల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య లిమిటెడ్ ఏర్పాటు చేయబోతున్నామని అన్నారు. వ్యవసాయ ఆధారిత కుటుంబాలకు ఆర్థిక అభివృద్ధికి కృషి చేయుటకు, కాల ఉత్పత్తికి, డెయిరీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని, మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడాలంటే పాడి పరిశ్రమలు అభివృద్ధి చేసుకోవాలన్నారు.ఇది కేవలం ఒక ఆర్థికపరమైన వ్యాపారం మాత్రమే కాదు, ప్రజల జీవితాల్లో వెలుగు నింపే మహా యజ్ఞం అని, ఈ యజ్ఞంలో పరకాల నియోజకవర్గం ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. గ్రామీణ కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధి, స్వయం సమృద్ధి పశుపోషకులకు న్యాయమైన ఆదాయం, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు.డెయిరీ స్థాపన ద్వారా సహకార సంఘాలు ఏర్పాటు, శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేసుకోవడం మరియు విలువైన ప్రభుత్వ భూమిని దామెరలో 10 ఎకరాలు కేటాయింప చేసుకోవడం వంటి దశలను పూర్తి చేసుకోవడం జరిగిందని అన్నారు. రాష్ట్ర, జిల్లా యంత్రాంగం మరియు ముల్కనూరు సహకార డెయిరీ వారి సహాయ సహకారాలతో మరియు పరకాల నియోజకవర్గంలోని 6 మండలాలను కలుపుకొని దామెరలో డెయిరీని స్థాపిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు అవకాశం కల్పిస్తే ఏ విధంగా అభివృద్ధి చెందవచ్చునో పాకాల మహిళా బ్యాంక్ నిదర్శనం అన్నారు.

## పరకాల దవాఖానలో కనీస సదుపాయాలు నిల్

- **ఇబ్బందుల్లో రోగులు**
- **ఇదేంటని ప్రశ్నిస్తే అధికారుల నిర్లక్ష్యపు సమాధానాలు**



అక్షర దర్బార్, పరకాల: పరకాల ప్రభుత్వ దవాఖానలో వైద్యసేవల నిర్లక్ష్యం మరోసారి వెలుగులోకి వచ్చింది. కౌకొండ గ్రామానికి చెందిన మేకల ప్రవీణ్ కు ప్రమాదంలో కాలుకు గాయం కాగా, మంగళవారం పరకాల దవాఖానకు వచ్చాడు. ఎక్స్ రేలో ఎముకలో క్రాక్ ఉన్నట్లు వైద్యులు గుర్తించి, రెండు పట్టీలు రాయగా, ల్యాబ్ లో పట్టీలు అందుబాటులో లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఈ విషయాన్ని డ్యూటీ డాక్టర్ను ప్రశ్నించగా, "ఇక్కడ ఏమీ లేదు, కావాలంటే ఎంజీఎం వెళ్లండి" అని నిర్లక్ష్యంగా స్పందించారని బాధితుడు వాపోయాడు. ఆర్ఎంఓ కూడా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. కనీస వైద్య సామగ్రి అందుబాటులో లేకపోవడం పరకాల దవాఖానలో పరిస్థితులను బట్టబయలు చేస్తోందని రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**హాస్పిటల్ లో క్రై బ్యాండేజ్ కొరత ఉంది**

**సూపరింటెండెంట్ డా.గౌతమ్ చౌహాన్**

ఈ ఘటనపై పరకాల ప్రభుత్వ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. గౌతమ్ చౌహాన్ స్పందించారు. "హాస్పిటల్లో క్రై బ్యాండేజ్ కొరత ఉంది. అవసరమైతే దానికి ప్రత్యామ్నాయంగా పట్టీ బ్యాండేజ్ వాడుతున్నాం. ఈ సమస్యను పై అధికారులకు తెలియజేశాం. త్వరలోనే బ్యాండేజ్ అందుబాటులోకి వస్తుంది" అని తెలిపారు.

## ఐఏపీ జిల్లా అధ్యక్షుడిగా రోహిత్ సాదు



అక్షర దర్బార్, పరకాల: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజియోథెరపిస్ట్స్ (ఐఏపీ) వరంగల్ జిల్లా నూతన అధ్యక్షుడిగా డాక్టర్ రోహిత్ సాదును నియమించినట్లు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పూర్ణ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం జరిగిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దక్షిణ జోన్ సీఈసీ లీడర్ డా.అంజని కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు డా. పూర్ణచంద్రశేఖర్,ఐఏపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు డా.ఆకుల అజయ్ కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని పలు జిల్లాల నుండి ఫిజియోథెరపిస్టులు హాజరయ్యారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో డీఈవో తనిఖీ



అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మండలంలోని రంగాపురం, మొగుళ్లపల్లి, కొరికిశాల గ్రామాల్లోని కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలు, ఎంఈఓ కార్యాలయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ముద్దమల్ల రాజేందర్ మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయుల, విద్యార్థుల రిజిస్టర్, మధ్యాహ్న భోజన (MDM) రికార్డులను ఆయన పరిశీలించారు. ప్రతి విద్యార్థి యుడైస్ లో తప్పనిసరిగా నమోదై ఉండాలని, రిజిస్టర్ లో ఉన్న విద్యార్థుల హాజరును ఎఫ్ఆర్ఎస్ మొబైల్ యాప్ ద్వారా నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు.తరగతి గదిలో ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ అమలును పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించిన ఆయన, నాణ్యమైన పౌష్టికాహారం అందేలా భోజన తయారీలో జాగ్రత్తలు తీసుకోవాలని కార్మికులను ఆదేశించారు.ఈ తనిఖీల్లో జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ దుప్పటి రాజగోపాల్, మండల విద్యాశాఖ అధికారి లింగాల కుమారస్వామి, డిసిఈబి అసిస్టెంట్ సెక్రటరీ కిషన్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలి

**- రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య**



అక్షర దర్బార్, టేకుమట్ల: తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం కరపత్రాల ఆవిష్కరణ టేకుమట్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద భూపాలపల్లి నియోజకవర్గ కన్వీనర్ అరకొండ రాజయ్య అధ్యక్షతన ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య హాజరై మాట్లాడుతూ.. ఈ నెల 26న భూపాలపల్లిలో జరిగే 49వ తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం ఆవిర్భావ దినోత్సవాలకు ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని, ఉత్తమ సేవలు అందించిన సభ్యులకు సన్మానం, పురస్కారాలు ఉంటాయని తెలిపారు.

## శాయంపేటలో 'జన సురక్ష'



అక్షర దర్బార్ శాయంపేట : మండల కేంద్రంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో జన సురక్ష కార్యక్రమాన్ని వలంటరీ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో విడ్స్ కౌన్సిలర్ మారపెల్లి క్రాంతి కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా కలిగి ఉండాలి. ప్రైవేట్ బ్యాంకుల వద్ద అధిక వడ్డీలతో రుణాలు తీసుకొని బాధపడవద్దు, ప్రభుత్వ రంగ బ్యాంకులతోనే లావాదేవీలు జరిపించాలని దాని ద్వారా అధిక వడ్డీ నుంచి విముక్తి పొందవచ్చని అన్నారు. వ్యక్తిగత ప్రమాద బీమా, ఆరోగ్య బీమాలను ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని అన్నారు. అపరిచితులు పంపించిన లింకులను ఓపెన్ చేయకుండా జాగ్రత్త పడాలని ఓటీపీలను ఎవరికి షేర్ చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్బీఐ సిబ్బంది విజయ్ కుమార్, మనోజ్, వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.



## వైభవంగా గోపాలకాలువలు

అక్షర దర్బార్, టేకుమట్ల: మండలంలోని ఆశిరెడ్డిపల్లి గ్రామంలో గోపాలకాలువలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. చిన్నారులు గోపాల కృష్ణ వేషధారణలో ఆకట్టుకున్నారు. వేణుగానాలు, భజనలు, కీర్తనలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పెద్దలు, చిన్నలు కలిసి ఉత్సవాన్ని పండగలా జరుపుకోవడం గ్రామంలోని ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది.

## 'ఏలేటి సోమిరెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి'

అక్షర దర్బార్ నల్లబెల్లి నెల నెల జీతం సక్రమంగా రాక ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడిన పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ ఏలేటి సోమిరెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ ద్వారా ముఖ్యమంత్రికి వినతిపత్రం పంపిన తర్వాత సాంబయ్య మాట్లాడుతూ.. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల అధికారి కార్యాలయంలో నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో సోమిరెడ్డి ఆవేదన చెంది ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరం. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన ఈ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలి" అని అన్నారు. మృతుడు సోమిరెడ్డి కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి, ఆ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని సాంబయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లకు ప్రతి నెలా క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.



# ఆరోగ్యశ్రీ సేవలు బంద్

- నేటి అర్ధరాత్రి నుంచి..
- పేరుకుపోయిన బకాయిలు రూ.1,400 కోట్లు
- మొదటి విడతగా రూ.100 కోట్లు.. మరికొద్దిరోజుల్లో రూ.40 కోట్లు ఇస్తామన్న సర్కార్
- ససేమిరా అన్న టీఏన్‌హెచ్‌ఏ ప్రతినిధులు
- సేవలు నిలిచిపోతే ప్రజారోగ్యంపై ప్రభావం
- ఉద్యోగులు, జర్నలిస్టుల హెల్త్ స్కీములకూ బ్రేక్



**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :**

తెలంగాణ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ (టీఏన్‌హెచ్‌ఏ) పిలుపు మేరకు ఆరోగ్యశ్రీ పరిధిలోని 323 నెట్‌వర్క్ ప్రైవేటు ఆస్పత్రుల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోనున్నాయి. ప్రభుత్వం నుంచి పెద్దమొత్తంలో బకాయిలు రావాల్సి ఉందని, ఈ విషయమై ఆరోగ్య శాఖ మంత్రి, ఆరోగ్యశ్రీ సీఈవోలను కలిశామని.. అయినా పరిష్కారం కాకపోవడంతో వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు అసోషియేషన్ ప్రకటించింది. తమకు రూ.1,400 కోట్ల బకాయిలు విడుదల చేయాల్సి ఉండగా, సోమవారం రూ.100 కోట్ల బకాయిలు విడుదల చేశామని, మరో రూ.40 కోట్లు త్వరలో విడుదల చేయనున్నామని వైద్య వర్గాలు వెల్లడించాయి. అయితే.. ప్రభుత్వం ఇచ్చే ఆ సొమ్ము ఏమాత్రం సరిపోదని అసోషియేషన్ స్పష్టం చేసింది. సేవల బంద్ కొనసాగుతుందని తేల్చిచెప్పింది.

### - ఉద్యోగులు, జర్నలిస్టుల సేవలపైనా ప్రభావం..

ఆరోగ్య శాఖ, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఈ అనివార్య నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని సంఘం తెలిపింది. ఆరోగ్యశ్రీ పథకం కింద మాత్రమే కాకుండా, ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ ఎస్), జర్నలిస్టుల ఆరోగ్య పథకం (జర్నలిస్టుల) సేవలు కూడా నిలిచిపోతాయని తెలిపింది. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ఆసుపత్రి యాజమాన్యాలు సిబ్బందికి జీతాలు ఇవ్వలేకపోతున్నామని, మందుల కొనుగోలు చేయలేకపోతున్నామని తెలిపింది. వైద్య సేవల ధరలు ఇప్పటికీ ప్రభుత్వం నుంచి పాత ధరల ప్రకారమే ఉన్నందున, వాటిని పెంచాలని ఆసుపత్రులు డిమాండ్ చేసింది. ప్యాకేజీల రేట్లు పెంచకపోవడంతో ఆర్థిక నష్టాలు ఎదుర్కొంటున్నామని తెలిపింది. 2025 జనవరి 10న ఆసుపత్రి యాజమాన్యాలు 10 రోజుల పాటు ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేశాయి. ఆ సమయంలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజా నరసింహ జోక్యం చేసుకొని నాలుగు నెలల్లో బకాయిలు క్లియర్ చేస్తామని హామీ ఇచ్చారు. అయితే, పూర్తి స్థాయిలో సమస్య పరిష్కారం కాకపోవడంతో ఇప్పుడు మరోసారి ఈ పరిస్థితి తలెత్తింది. ప్రస్తుత వైద్యారోగ్యశాఖ మంత్రి నర్సింహ ప్రభుత్వంతో మాట్లాడి నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీతో సంఘం సంతృప్తి చెందలేదు.

### - ప్రజారోగ్యంపై ప్రభావం

ఆరోగ్యశ్రీ పథకం కింద 3.2 కోట్ల మంది పేద, బీపీఎల్ కుటుంబాలకు చెందిన ప్రజలకు రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందుతాయి. సేవలు నిలిపివేయడంతో పేదలు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ప్రైవేట్ ఆసుపత్రులు వైద్య సేవలు ఆపడంతో ప్రభుత్వ ఆసుపత్రులపై భారీగా ఒత్తిడి పెరుగుతుంది. గత జనవరిలో రోగులు పడిన కష్టాలు ఇప్పుడు మళ్లీ పునరావృతం కానున్నాయి.



మాట్లాడుతున్న సీపీ సన్ ప్రీత్ సింగ్

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### - వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

అక్షరదర్బార్, హనుమకొండ: నేడు ప్రపంచవ్యాప్తంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అమాయకులను మోసం చేయడంలో సైబర్ క్రైమ్ ప్రధానమైందని, దీనిని నివారించుటకు మనమందరం ముఖ్యంగా యువత అప్రమత్తంగా వ్యవహరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. మంగళవారం హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సైబర్ క్రైమ్ పై నిర్వహించిన అవగాహన సదస్సు కార్యక్రమానికి సీపీ ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కేయూ రిజిస్టర్ ప్రొఫెసర్ వీ రామచంద్రం, సైబర్ క్రైమ్ ఏసీపీ కె గిరికుమార్, వైస్ ప్రిన్సిపల్ రెహ్మాన్ పాల్గొన్న కార్యక్రమంలో సిపి మాట్లాడుతూ సైబర్ నేరాలకు ఎవరు పాల్పడిన చట్ట ప్రకారం శిక్షించబడతారన్నారు. సైబర్ నేరాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ముఖ్యంగా ఇటీవల ఏఐ సాంకేతిక విధానం ఉపయోగించి సైబర్ నేరగాళ్లు అమాయకులను దోచుకుంటున్నారన్నారు. యువత అమాయకంగా ఎవరిని నమ్మడం గాని, డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు లోను కాకూడదని  అన్నారు. ప్రొఫెసర్ రామచంద్రం మాట్లాడుతూ ఆపదలో ఉన్నామంటూ మనకు తెలిసిన ముఖాలు తగిలించుకొని సైబర్ నేరాలకు పాల్పడడం జరుగుతుందని, యువత అటువంటి వాటిని ఎదుర్కొనే విధంగా అవగాహన కలిగి ఉండాలని అన్నారు, సైబర్ నేరగాళ్లు మనకు తెలవకుండానే మన ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ నెంబర్ తో అనుసంధానం చేసుకొని మనకు తెలవకుండా బ్యాంకులో ఉన్న డబ్బును దోసుకుంటున్నారని, మనకు తెలియని వారు, ఎవరైనా ఫోన్ చేసిన మెసేజ్ పెట్టిన, వెంటనే స్పందించవద్దని, ఎవరైనా నేరాలకు పాల్పడితే శిక్షలు కఠినంగా ఉంటాయని. డ్రగ్స్, మత్తు పదార్థాలకు లోన్ కాకూడదని ప్రొజెక్టర్ ద్వారా సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జ్యోతి మాట్లాడుతూ మారిన ఆధునిక కాలంలో అత్యంత భయంకరమైన నేరాలు జరుగుతున్నాయని, ఇందులో ముఖ్యమైనది సైబర్ క్రైమ్ చాలా ప్రమాదకరమైందని, ముఖ్యంగా యువత దీనిపై అవగాహన కలిగి ఉండే విధంగా ఈ సదస్సును ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెహమాన్, వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, నార్కోటెక్ ఇన్ స్పెక్టర్ సతీష్, కళాశాల అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## యూరియా కోసం రైతుల ఇబ్బందులు

అక్షర దర్బార్, నల్లబెల్లి: ఎరువుల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మేడపల్లి–రాంపూర్ రైతు వేదిక వద్ద యూరియా కోసం క్యూలైన్‌లో రాత్రంతా నిలబడిన రైతులకు ఉదయం టోకెన్లు ఇస్తుండగా తొక్కిసలాట జరిగింది. ఒక రైతు కిందపడిపోగా గాయపడ్డాడు."రాత్రంతా క్యూలో నిలబడ్డా బస్తా దొరకలేదు" అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువులను సకాలంలో అందుబాటులో ఉంచాలని, రైతు సమస్యలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## విద్యుత్ శాఖ ఏడీఈ అరెస్టు

### - ఆదాయానికి మించి రూ.300 కోట్ల ఆస్తులు కూడబెట్టిన అధికారి



అక్షరదర్బార్, హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో టీజీఎస్పీడీసీఎల్ విద్యుత్ శాఖ ఏడీఈ అంబేద్కర్‌ను మంగళవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు అరెస్టు చేశారు. సదరు అధికారి రూ.300 కోట్ల వరకు ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపర్చనున్నారు. మంగళవారం ఉదయం నుంచి ఆయన కుటుంబసభ్యులు, బంధువుల ఇళ్లలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. అంబేద్కర్ బంధువు ఇంట్లో రూ.2కోట్ల నగదును అధికారులు గుర్తించారు. ఇబ్రహీంబాగ్‌లో ఏడీఈగా పనిచేస్తున్న ఆయన.. భారీగా ఆస్తులు కూడబెట్టారు. శేరిలింగపంల్లిలో ఇళ్లు, గచ్చిబౌలిలో 5 అంతస్తుల భవనం, హైదరాబాద్‌లోని ప్రధాన ప్రాంతాల్లో 6 ఇళ్లు, ఓపెన్ ప్లాట్లు, రెండు కార్లు, బంగారు ఆభరణాలు, బ్యాంకు డిపాజిట్లు, వ్యవసాయ భూమి ఉన్నట్టు అధికారులు గుర్తించారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915